| |
|---|
| ఈరోజు జరిగిన సిపిఐ(ఎం) ప్రెస్ కాన్ఫరెన్స్ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము - జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి |

**తేది : 28.2.2023**

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారిపార్టీ బరితెగింపు**
**పోలీసుల సహకారంతో దౌర్జన్యాలు**
**ఎన్నికల కమీషన్ నిద్రపోతోంది**
**ఉద్యోగులకు జీతాల్విలేని వారికి ఓటడిగే హక్కులేదు**
**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**

రాష్ట్రంలో ప్రజలు, ఉద్యోగుల మద్దతును కోల్పోయిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం శాసనమండలి ఎన్నికల్లో అడ్డగోలుగానైనా నెగ్గి ప్రజలు, ఉద్యోగులు తమ వెంటే వున్నారని చాటుకునేందుకు బరితెగింపు రాజకీయాలకు పాల్పడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి అనర్హులతో ఓటర్ల జాబితాలను తయారు చేసినా నామినేషన్‌లను పోలీసులనుపయోగించి దౌర్జన్యంగా ఉపసంహరింపజేసినా ఎన్నికల కమీషన్ మొద్దు నిద్రలో వుండటం తగదని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం సోమవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను మంగళవారం వి.శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. ఎన్నికలకు ముందు సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఆర్బాటంగా చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు పద్ధతుల్లో ఉద్యోగసంఘాలతో కనీసంగా చర్చించకుండా సిపిఎస్‌ను రద్దు చేయకుండా జిపిఎస్ అంటోందని విమర్శించారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని, నిరుద్యోగులకు ఊరట కల్పించేలా నోటిఫికేషన్‌లను ఇవ్వలేని ఈ ప్రభుత్వంకు ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. కోవిడ్ సమయంలో ప్రైవేట్ స్కూల్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎలా ఓటు అడుగుతుందని అన్నారు. వైసిపి నాయకులకు చెందిన ప్రైవేట్ స్కూల్‌ల పేరుతో దొంగ ఓట్లను చేర్పించడమే కాదు ఐడెంటిటీ కార్డులను కూడా తయారు చేస్తున్నారని తెలిపారు. దొంగ ఓట్లతో నెగ్గాలనుకునే అధికారపార్టీ చర్యలను ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు ప్రతిఘటించాలని కోరారు.

రాష్ట్రంలో ఉద్యోగులను, ఉపాధ్యాయులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ఇంటిదారి పట్టాల్సి వస్తుందని ఎలాగైనా గెలవాలని మంత్రులను, ఎమ్మెల్యేలను పురమాయించిందని తెలిపారు. శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్యేలు పనిచేసేందుకని చివరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను కూడా వాయిదా వేసుకున్నారని అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రిగ్గింగ్‌కు ప్రణాళికలు తయారు చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థలకు నిధులను ఇవ్వకపోవడంతో తీవ్ర అసంతృప్తితో స్థానికసంస్థల స్థానాలను ఏకగ్రీవం కాకుండా నామినేషన్‌లను వేశారని తెలిపారు. అక్రమకేసులు బనాయిస్తామని పోలీసులను ఉసిగొల్పి బలవంతంగా నామినేషన్‌లను ఉపసంహరింపజేస్తున్నారని విమర్శించారు.

శాసన మండలి ఎన్నికల్లో ఓటర్ల జాబితా తయారు నుండి నామినేషన్‌ల దాకా అడుగడుగునా అధికారపార్టీ అక్రమాలకు పాల్పడుతున్నా ఎన్నికల కమీషన్ కనీసంగా స్పందించకపోవడం తగదని అన్నారు. దొంగ ఓట్ల వివరాలను పేర్లతో సహా ఇచ్చినా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఆర్‌జెడి ప్రతాపరెడ్డి, ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌లు బహిరంగంగా అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యా శాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఇన్స్పెక్షన్‌ల పేరుతో టీచర్లను భయభ్రాంతులకు గురి చేసి పాఠశాలల్లో అశాంతిని సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల నిర్వహణను సజావుగా నడపడం చేతగాకపోతే అధికారి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా అదాని అక్రమాల వ్యవహారంపై వార్తలు వస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అదాని కంపెనీతో కొత్త ఒప్పందాలను చేసుకోవడం తగదని హెచ్చరించారు.

= = =